

## మీకోసం

ధనియాలు నోట్లో వేసుకొని చప్పరిస్తూ ఉంటే నోటి దుర్వాసన తగ్గిపోతుంది.

## జీవన సౌరభం

వైఫల్యం ఎదురైతే నిరాశ చెందకూడదు. అది కొత్త ప్రేరణకు పునాది కావాలి.



# ఉత్తమ ఉపాధ్యాయుడు



శ్రీనివాసులు మాష్టారు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎన్నికైనట్లు హెడ్ మాస్టర్ తెలిపారు. బడి పిల్లలు, మాష్టార్లు శ్రీనివాసులును అభినందించారు.

మరుసటిరోజు ఉదయం పదవ తరగతి పిల్లలందరూ శ్రీనివాసులు మాష్టారు దగ్గరకు వెళ్లి గొప్పగా సన్మానం చెయ్యాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

"అంతగొప్పగా నాకు సన్మానం ఎందుకు చెయ్యాలనుకొంటున్నారు" అంటూ ప్రశ్నించారు శ్రీనివాసులు.

"ఈ పురస్కారం వల్ల మీకు ఎన్నో గౌరవమర్యాదలు దక్కుతాయి సార్. అందుకే ముందుగా మా తరపున చాలా గొప్పగా సన్మానం చెయ్యాలనుకొంటున్నాము" అన్నాడు జబ్బార్.

"అయితే నేను ఒక విషయం చెబుతా అది చేస్తారా" అన్నారు శ్రీనివాసులు మాష్టారు.

"చెప్పండి సార్" అంది సహజ.

"ముందు ఉపాధ్యాయ దినోత్సవం ఎలా వచ్చిందో చెప్పండి?" అన్నారు మాష్టారు.

"డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినాన తనను అభినందించేందుకు వచ్చిన వారితో 'నాకు సన్మానాలు, శుభాకాంక్షలు చెప్పే బదులుగా నా జన్మదినాన్ని 'ఉపాధ్యాయ దినోత్సవంగా' ప్రకటించి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తే నాకు సన్మానం చేసినట్లుగా భావిస్తాను' అని చెప్పారు. అప్పటి నుంచి సెప్టెంబర్ 5వ తేదీని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది" అని చెప్పాడు ప్రసాద్.

'నేను కూడా ఆడంబరాలను, సత్కారాలను ఇష్టపడను. మీరు ఎంతో ఆడంబరంతో నన్ను సన్మానించినా కొన్ని రోజుల తర్వాత అందరూ మరచిపోతారు. అదే మీరు ఆ ఖర్చుతో ఊరంతా చెట్లు నాటించండి. అలా చేస్తే అవి పెరిగాక ఈ ఊరి ప్రజలు, మీరు వాటి విలువలు గుర్తించగలరు. అప్పుడే మీరంతా నన్ను గొప్పగా సన్మానించినట్లుగా భావిస్తాను' అన్నారు మాస్టారు.

విద్యార్థులు హెడ్ మాస్టర్ దగ్గరకెళ్ళి జరిగిందంతా చెప్పారు.

"ఆయన ఇప్పుడు కూడా ఉత్తమ ఉపాధ్యాయుడుగా నడచుకొన్నారు" అని లోలోన హెడ్ మాస్టర్ సంతోషపడుతూ 'ఇంకేం మరి మీ మాస్టారు చెప్పిన పనిని త్వరగా ప్రారంభించేయండి' అని పిల్లలను హుషారు పరిచారు.

**- ఓట్ర ప్రకాష్ రావు,**
**9787446026.**

## గుర్తించారా!

గళ్లలో ఇచ్చిన ఆంగ్ల అక్షరాల్లో కింద ఇచ్చిన పండ్ల పేర్లున్నాయి. ఎక్కడున్నాయో గుర్తించండి చూద్దాం!

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| s | t | r | a | w | b | e | r | r | y |
| o | r | a | n | j | e | p | e | a | r |
| r | m | e | h | o | a | e | w | n | a |
| a | b | a | b | a | n | a | n | a | p |
| n | x | p | a | i | r | c | e | y | p |
| g | r | a | p | e | s | h | k | a | l |
| e | p | i | n | e | a | p | p | l | e |



## నేను గీసిన బొమ్మ





అనుపమశ్రీ,
7వ తరగతి,
కేసరపల్లి.

---

ప్రభుత్వ పాఠశాలల పట్ల సమాజంలో ఉన్న చులకన భావనను పోగొట్టేలా కర్నూలు జిల్లా ఆలూరు మండల మోడల్ స్కూలు 'ఆదర్శ'ంగా నిలుస్తోంది. ప్రతి సంవత్సరం ఈ పాఠశాల విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు, నగదు పారితోషకాలు అందుకుంటున్నారు.

# ఆలూరు పాఠశాల ఆదర్శం






విద్యాపరంగా వెనుకబడిన మండలాల అభివృద్ధికోసం జిల్లాలో 36 ఆదర్శ పాఠశాలలు నెలకొల్పబడ్డాయి. కొండప్రాంతంలో ఉండే ఆలూరు మండల ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎట్‌టిఎస్‌ఇ, ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్, ట్రిపుల్ ఐటి, ఒలంపియాడ్స్ వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో తమ ప్రతిభను చూపుతున్నారు. ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో పతకాలు సాధిస్తున్నారు. ఇప్పటి వరకు 221 మంది విద్యార్థులు ఈ పతకాలు పొందారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలో నాలుగేళ్లుగా ఆలూరు ఆదర్శ పాఠశాల విద్యార్థి జిల్లా టాపర్‌గా నిలవడం విశేషం.

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఆహ్లాదకరమైన వాతావరణం, మౌలిక వసతులతో రూపు దిద్దుకున్న ఈ పాఠశాలలో సృజనాత్మక, పరిశీలనాత్మక, క్రీడా పద్ధతుల్లో బోధన జరుగుతోంది. ప్రతి సంవత్సరం 660 పైగా విద్యార్థులుండే ఈ పాఠశాలలో ఆరవ తరగతి నుంచి ఇంటర్మీయట్ వరకు ఉన్నత, నాణ్యమైన బోధన అందిస్తున్నారు. ఉపాధ్యాయులు అదనపు సమయాన్ని కేటాయిస్తూ విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. పోటీ పరీక్షల వల్ల కలిగే విజ్ఞానం, ప్రయోజనాలే కాకుండా ప్రస్తుతం సామాజిక బాధ్యత, మహిళా విద్య, కోవిడ్ వంటి సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పిస్తున్నారు ప్రిన్సిపల్ ఈరన్న.

### జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పతకాలు

2020–21 సంవత్సరానికి గాను ఆలూరు మోడల్ స్కూల్ 10వ తరగతి విద్యార్థి డిపి.పవన్‌కుమార్ ఎన్‌టిఎస్‌ఇ (నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్)కు ఎంపికయ్యాడు. రెండో దశ పరీక్షకు సిద్ధమవుతున్నాడు. ఈ పరీక్షలో జిల్లా నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థి పవన్. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షలో అర్హత పొందిన విద్యార్థికి ఇంటర్ నుంచి పిజి వరకు రూ.24 వేల ఉపకార వేతనం లభిస్తుంది. అలాగే ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్‌కు 8వ తరగతిలో పరీక్ష రాసి అర్హత పొందిన విద్యార్థులకు 9 నుండి 12వ తరగతి వరకు ప్రతి ఏడాది రూ.12 వేలు విద్యార్థి ఖాతాలో జమ చేస్తారు. ఈ పరీక్ష రాసి 2015 నుండి 2021 వరకు మొత్తం 107 మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు అర్హులయ్యారు.

### ఒలంపియాడ్‌లో పథకాల పంట

అంతర్జాతీయ స్థాయిలో ఇంగ్లండ్ దేశం నిర్వహించే ఒలంపియాడ్స్ పరీక్షల్లోనూ రాణిస్తున్నారు ఆలూరు 'ఆదర్శ' విద్యార్థులు. మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లిష్, కామర్స్ ఒలంపియాడ్లలో ఇప్పటివరకు 43 మంది స్వర్ణ, రజత, కాంస్య పతకాలు పొంది అంతర్జాతీయ గుర్తింపు సాధించారు. 2020–21కి గాను ఆన్‌లైన్ ద్వారా ఒక విద్యార్థి ఐఇఒ, ఐఎంఒ, ఐఎస్‌ఒలో బంగారు పతకంతో పాటు నగదు బహుమతి గెలుచుకుంది. ఒలంపియాడ్ పోటీ పరీక్షల కోసం కె.శ్రీనివాసులు, కె.మల్లికార్జున, బి.మల్లికార్జున, జి.బాలశౌరి, బి.సిద్దేశ్, ఎఫ్.ఖాజా హుసేన్, ఎ.ఎలిజబెబిత్ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు.

### ట్రిపుల్ ఐటిని సొంతం చేసుకున్న విద్యార్థులు

ఆలూరు మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతి ఏడాది ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 11 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో ర్యాంకులు సాధించి ప్రస్తుతం చదువును కొనసాగిస్తున్నారు. అంతేగాక ఈ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ గుర్తింపు పొందారు. ముఖ్యంగా సెపక్ తక్రా క్రీడలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ జట్టులతో తలపడ్డారు. రాష్ట్రస్థాయిలో 32, జాతీయ స్థాయిలో 16 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థి హరికిషన్ జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు.

**- ఎం.కృష్ణ**
**ప్రజాశక్తి ఆలూరు విలేకరి**

### ఉపాధ్యాయుల బోధనా విధానంతోనే

టీచర్ల బోధనా విధానం చాలా బాగుంటుంది. చదువుపట్ల ఇష్టం పెరిగేలా సులభంగా అర్థమయ్యే రీతిలో చెప్పేవాళ్లు. కాబట్టి వారు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వినేవాళ్లం. సందేహాలు వస్తే వెంటనే నివృత్తి చేస్తారు. మా ఉపాధ్యాయుల కృషి వల్లే 2019–20లో ట్రిపుల్ ఐటిలో సీటు సాధించాను.



**ఎస్.గాయత్రి**
**ట్రిపుల్ ఐటి విద్యార్థి**

### ఉన్నత చదువులకు దోహద పడతాయి



ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో నేను జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యాను. అవి మాకు ఉన్నత చదువులకు దోహదపడతాయి. ఇప్పుడు ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉన్నాను. బాగా చదివి మంచి గుర్తింపు సాధించి, పాఠశాలకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తాను.

**డిపి.పవనకుమార్,**
**ఎన్‌టిఎస్‌ఇకి ఎంపికైన విద్యార్థి**

### ఉపాధ్యాయుల సహకారంతో పతకాలు

విద్యార్థులు పోటీ పరీక్షల్లో, క్రీడల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారంటే ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉంది. వారి ప్రతిభ, అంకితభావం, విద్యార్థుల ఆసక్తితోనే ఇంత సక్సెస్ సాధిస్తున్నాం. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు పతకాలు సాధించేందుకు కృషి చేస్తాం. విద్యార్థులు కూడా పోటీ పరీక్షలు రాయడానికి తమకు తాముగా ముందుకొస్తున్నారు. ఫోర్త్‌జోన్ (కడప, చిత్తూరు, కర్నూలు, అనంతపురం) నుంచి ఎన్‌టిఎస్‌ఇకి క్వాలిఫై అయింది మా విద్యార్థే అని చెప్పుకోవడానికి గర్వంగా ఉంది. ఈ పాఠశాల ప్రిన్సిపల్‌గా ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్‌కోసం ప్రయత్నించడం నా బాధ్యత.



**ఈరన్న,**
**ప్రిన్సిపల్**

### విద్య ప్రాధాన్యత, ప్రయోజనం తెలియజేస్తాం



మా పాఠశాలలోని విద్యార్థులంతా వెనకబడిన వర్గాలకు చెందినవారే. మేమూ ఆ తరగతుల నుంచే వచ్చాం. మా విద్యార్థుల్లో వ్యూహాలు, ప్రమాణాలు అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తున్నాం. చాలామంది విద్యార్థులు గాని, తల్లిదండ్రులు గాని పదో తరగతికి ఇచ్చిన ప్రాధాన్యత మిగతా తరగతులకు ఇవ్వరు. కానీ అది తప్పని తెలియజేస్తూ విద్యవైపు తిప్పుతూ పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తాం. చదువుపై నమ్మకాన్ని, భవిష్యత్తుపై భరోసాను కల్పిస్తున్నాం. సమాజం, జీవితం పట్ల బాధ్యతను గుర్తించేలా ప్రోత్సహిస్తాం.

**ఎస్.పరుశురాం, ఉపాధ్యాయుడు**

---



## 'ఆరడుగుల బుల్లెట్' ట్రైలర్ విడుదల

గోపీచంద్, నయనతార జంటగా నటించిన చిత్రం 'ఆరడుగుల బుల్లెట్'. బి.గోపాల్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. కామెడీతో పాటు యాక్షన్ సన్నివేశాలతో ట్రైలర్‌ను ఆసక్తికరంగా తెరకెక్కించారు. ఇప్పటికే పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ సినిమా అక్టోబర్ 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. జయబాలజీ రీల్ మీడియా ప్రైవేట్ లిమిటెట్ పతాకంపై తాండ్ర రమేశ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రకాశ్‌రాజ్, బ్రహ్మానందం కీలకపాత్రలు పోషించారు. మణిశర్మ ఈ చిత్రానికి సంగీతం అందించారు.

## నేను బాగానే ఉన్నాను : తేజ్



యాక్సిడెంట్ కారణంగా గత కొన్ని రోజులుగా ఐసియుకే పరిమితమైన కథానాయకుడు సాయితేజ్ సోషల్ మీడియా వేదికగా తొలిసారి స్పందించారు. పూర్తిగా కోలుకున్నాను అనే దానికి సంకేతంగా ట్విటర్‌లో థంబ్స్ అప్ సింబల్ పెట్టడంతో ఆయన అభిమానులు ఎంతో సంతోషిస్తున్నారు. సినీ వర్గాలు, ఆయన స్నేహితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు సైతం ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 'మీరు నాపై, నా సినిమా 'రిపబ్లిక్'పై చూపించిన ప్రేమ, అభిమానం, ఆదరణకు కృతజ్ఞతగా థ్యాంక్స్ చెప్పడం అనేది చాలా చిన్న మాట అవుతుంది. త్వరలోనే మీ అందరి ముందుకు వస్తాను' అని ట్వీట్‌లో సాయితేజ్ పేర్కొన్నారు.

## అక్టోబరు 7న ప్రభాస్ కొత్త సినిమా ప్రకటన

ప్రభాస్ 25వ సినిమాకి సంబంధించిన సమాచారం అక్టోబర్ 7న విడుదలకానుంది. ఈ చిత్రానికి సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం 'రాధే శ్యామ్', 'ఆది పురుష్', 'సలార్' చిత్రాలతో పాటుగా, నాగ్ అశ్విన్ దర్శకత్వం లో మరొక పాన్ వరల్డ్ సినిమాలో ప్రభాస్ నటిస్తున్నారు. 'రాధే శ్యామ్' చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలకు సిద్ధమవుతూ ఉండగా, మిగిలిన చిత్రాలు షూటింగ్ దశల్లో ఉన్నాయి. నాగ్ అశ్విన్ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఇంకా మొదలు కావాల్సి ఉంది.

## రామ్‌కు గాయాలు



హీరో రామ్ పోతినేని గాయాల పాలయ్యాడు. ప్రస్తుతం తమిళ డైరెక్టర్ లింగుస్వామి దర్శకత్వంలో "రాపో19" తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో రామ్, తన పాత్రకు అవసరమైన బాడీ ట్రాన్స్ఫర్మేషన్ కోసం జిమ్‌లో కష్టపడుతున్నాడు. ఈ నేపథ్యంలో రామ్ మెడకు బలమైన గాయం అయినట్టు సమాచారం. అయితే అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే రామ్ డబుల్ ఎనర్జీతో తిరిగి వస్తాడని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం షూటింగ్‌ను ఆపేసి, రామ్ పూర్తిగా కోలుకున్నాక తిరిగి మొదలు పెట్టనున్నట్లు తెలిపారు.

## ఆర్యన్ ఖాన్‌కు బెయిల్ నిరాకరణ

**న్యూఢిల్లీ :** డ్రగ్స్ కేసులో బాలీవుడ్ నటుడు షారుఖ్‌ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్‌కు ముంబయి కోర్టు బెయిల్ నిరాకరించింది. గురువారం వరకూ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) కస్టడీ విధించింది. ఆర్యన్ ఖాన్‌తో సహా ఆదివారం అరెస్టు చేసిన ఎనిమిది మంది కస్టడీని పొడిగిస్తూ జడ్జి ఆదేశాలు ఇచ్చారు. ఈ కేసు దర్యాప్తు చాలా ప్రాముఖ్యత కలిగిందని విచారణను ముందుకు తీసుకుని వెళ్లడం చాలా అవసరమని, కస్టడీని పొడిగించడం నిందితులు, దర్యాప్తుదారులు ఇద్దరికీ ప్రయోజనం కలిగిస్తుందని జడ్జి తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో స్వీడిష్ కార్టూనిస్టు విల్క్స్ దుర్మరణం



**స్టాక్‌హోం :** మహ్మద్ ప్రవక్తపై కార్టూన్లు గీసి ముస్లింల ఆగ్రహానికి గురైన స్వీడిష్ కళాకారుడు లార్స్ విల్క్స్, ఆయన ఇద్దరు పోలీసు గార్డులు స్వీడన్‌లోని మార్కర్యాడ్ ప్రాంతంలో జరిగిన ఒక ప్రమాదంలో చనిపోయారు. 2007లో ఆయన వేసిన కార్టూన్లతో భావ ప్రకటనా స్వేచ్ఛపై అంతర్జాతీయంగా చర్చ జరిగింది. దైవ దూషణ చేసినందుకు ఆయన్ని హత్యచేయాలని ఆనాడు తీవ్రవాదులు ప్రయత్నించారు.

## జపాన్ నూరవ ప్రధానిగా కిషిదా



**టోక్యో :** జపాన్ నూరవ ప్రధానిగా ఫిమియో కిషిదాను పార్లమెంటు (డైట్) ఎన్నుకుంది. 465 మంది సభ్యులున్న పార్లమెంటు దిగువ సభలో 311 ఓట్లు ఆయనకు లభించాయి. ప్రధానిగా ఎన్నికైన వెంటనే ఆయన చేసిన తొలి ప్రకటన ఈ నెల 31న పార్లమెంటుకు తాజాగా ఎన్నికలు జరుగుతాయని వెల్లడించడం. పట్టుమని నెల రోజులు కూడా కాకమునుపే ఎన్నికలకు వెళ్లడం ద్వారా కొత్త ప్రభుత్వ ఇమేజితో తిరిగి గెలవచ్చని ఆయన అంచనా. ఆయనకు ముందు పదవీ విరమణ చేసిన యోషిదా సుగా గత ఏడాది అధికారం చేపట్టినప్పుడు 70 శాతం ప్రజామద్దతు సంపాదించాడు. తరువాత కోవిడ్‌ను ఎదుర్కోవడంలో ఘోరంగా విఫలం కావడంతో రేటింగ్ బాగా పడిపోయింది. పాలక లిబరల్ డెమొక్రటిక్ పార్టీ ఇప్పుడు తన ఆశలన్నీ కిషిదాపైనే పెట్టుకుంది. జరిగిన పార్లమెంటరీ పార్టీ ఎన్నికల్లో కిషదా విజయం సాధించారు.

## ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ సేవలకు అంతరాయం

**న్యూఢిల్లీ :** ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ సేవలకు సోమవారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు అంతరాయం ఏర్పడింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సేవలు నిలిచిపోయాయి. భారత్ తోపాటు ఇతర దేశాల్లోనూ యూజర్లు ఈ సమస్య ఎదుర్కొన్నారు. వాట్సాప్ నుంచి సందేశాలు వెళ్లడం, రావడం పూర్తిగా నిలిచిపోయాయి.

ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో సైతం ఫీడ్ రీఫ్రెష్ అవ్వడం లేదు. దీంతో పలువురు యూజర్లు ఇతర సామాజిక మాధ్యమాల వేదికగా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పనిచేయడం లేదంటూ పోస్టులు పెడుతున్నారు. సేవలకు అంతరాయం ఏర్పడడంపై ఫేస్‌బుక్ స్పందించింది. 'క్షమించాలి, ఏదో తప్పిదం జరిగింది. దానిపై మేం పనిచేస్తున్నాం. సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తాం' అని పేర్కొంది. వాట్సాప్ సేవల్లో అంతరాయం ఏర్పడినట్లు తమ దృష్టికి వచ్చినట్లు వాట్సాప్ సైతం ట్వీట్ చేసింది. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపింది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ కూడా ఫేస్‌బుక్‌కు చెందినవే కావడం గమనార్హం. భారత్‌లో ఫేస్‌బుక్‌కు 41 కోట్ల మంది యూజర్లు ఉండగా, 53 కోట్ల మంది వాట్సాప్‌ను వినియోగిస్తున్నారు. 21 కోట్ల మంది ఇన్‌స్టాగ్రామ్‌ను వాడుతున్నారు.

# టాప్‌లోకి ఢిల్లీ క్యాపిటల్స్

## చెన్నై సూపర్‌కింగ్స్‌పై మూడు వికెట్ల తేడాతో గెలుపు



హెట్‌మైర్ (18 బంతుల్లో 28 పరుగులు)

**దుబాయ్:** అగ్రస్థానం కోసం జరిగిన పోటీలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు మూడు వికెట్ల తేడాతో చెన్నై సూపర్‌కింగ్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేయగా.. ఛేదనలో ఢిల్లీ జట్టు 19.4 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 139 పరుగులు చేసి విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నైకు సీనియర్ బ్యాట్స్‌మన్ అంబటి రాయుడు(55నాటౌట్) మినహా.. మిగతా బ్యాట్స్‌మన్లంతా విఫలమయ్యారు. బౌలర్లకు సహకరించిన పిచ్‌పై ఓపెనర్లు గైక్వాడ్–డుప్లెసిస్ నిరాశపర్చడంతో 39 పరుగులకే తొలి రెండు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత ఊతప్ప(19), మొయిన్(5) కూడా ఆశించినస్థాయిలో రాణించకపోవడంతో 62 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత రాయుడు అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ ధోనీ 18 పరుగులతో రాణించడంతో చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 136 పరుగులు చేసింది. అక్షర్‌కు రెండు, నోర్జే, ఆవేశ్ ఖాన్, అశ్విన్‌కు తలా ఒక వికెట్ దక్కాయి. అనంతరం ఢిల్లీ ఓపెనర్లు పృథ్వీ షా(18), ధావన్(39) రాణించారు. కెప్టెన్ పంత్(15) కూడా రాణించడంతో ఢిల్లీ 6 ఓవర్లలోనే 51 పరుగులు చేసింది. రిపాల్ పటేల్(18) కూడా తోడవ్వడంతో ఆ జట్టు 13 ఓవర్లలో 93 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. కానీ చెన్నై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో వరుసగా వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ ఉత్కంఠకు దారితీసింది. చివర్లో హెట్‌మెయిర్(28నాటౌట్), రబడా(4) మ్యాచ్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. జడేజా, శార్దూల్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

## భారత్‌కు రెండు కాంస్యాలు

### సెమీస్‌లో పరాజయం

### ఆసియా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్

**దోహా:** ఇక్కడ జరుగుతున్న ఆసియా టేబుల్ టెన్నిస్(టిటి) ఛాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్‌లో భారత జోడీలకు నిరాశ తప్పలేదు. సోమవారం జరిగిన పురుషుల డబుల్స్‌లో సాథియాన్–శరత్ కమల్, హర్మన్ దేశాయ్–మానవ్ ఠక్కర్ జోడీలు పరాజయంపాలయ్యాయి. హర్మీత్–మానవ్ జోడీ 11–4, 6–11, 10–12, 9–11, 8–11తేడాతో కొరియాకు వూ–జింగ్–లిమ్ జోంగ్‌హోమ్ చేతిలో ఓడారు. ఇక శరత్–సాథియాన్ జోడీ 5–11, 9–11, 11–13తేడాతో యుకియా–షున్సుకే(జపాన్) చేతిలో వరుస సెట్లలో పరాజయంపాలయ్యారు. దీంతో సెమీస్‌లో ఓడిన భారత పురుషుల డబుల్స్ జోడీలకు కాంస్య పతకాలు ఖాయమయ్యాయి.

## భారత్-బంగ్లాదేశ్ ఫుట్‌బాల్ మ్యాచ్ డ్రా

### సాఫ్ ఛాంపియన్‌షిప్



**మాలే:** సాఫ్ (దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య) ఛాంపియన్‌షిప్ ఫేవరేట్ భారత్... బంగ్లాదేశ్ జట్టుతో జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. సోమవారం బంగ్లాదేశ్‌తో హోరాహోరీగా తలపడిన భారత్ 1–1 గోల్స్‌తో డ్రా చేసుకుంది. మాల్దీవ్స్ నేషనల్ స్టేడియంలో జరిగిన పోటీలో భారత్ తరపున గోల్‌ను కెప్టెన్ సునీల్ ఛెత్రీ 26వ నిమిషంలో చేశాడు. దీంతో భారత్ తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 1–0 ఆధిక్యతలో నిలిచింది. ఇక రెండో అర్ధభాగం 54వ నిమిషంలో బంగ్లాదేశ్‌కు చెందిన లిస్టన్ కొలాకో రెడ్‌కార్డ్‌కు గురవ్వడంతో ఆ జట్టు 10మంది సభ్యులతో ఆ తర్వాత మ్యాచ్ ఆడాల్సి వచ్చింది. కానీ 74వ నిమిషంలో కార్నర్‌ను యాసిన్ అరాఫత్ గోల్‌గా మలచడంతో స్కోర్ 1–1తో సమమైంది. ఆ తర్వాత ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలం కావడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇప్పటివరకు జరిగిన 12 సాఫ్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లలో ఏడుసార్లు టైటిళ్లు నెగ్గిన భారత్.. అదే జోరును బంగ్లాదేశ్‌పై చూపలేకపోయింది. ఇక భారత్ అక్టోబర్ 7న శ్రీలంకతో తలపడనుంది.

## హాట్ కేకుల్లా..

### భారత్-పాక్ టి20 ప్రపంచకప్ టిక్కెట్లు

**దుబాయ్:** భారత్–పాకిస్తాన్ జట్ల మధ్య జరగనున్న టి20 ప్రపంచకప్–2021 క్రికెట్ మ్యాచ్ టిక్కెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడైపోయాయి. అక్టోబర్ 24న దుబాయ్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌కు సంబంధించిన టిక్కెట్లు ఇటీవల అమ్మకానికి వచ్చాయి. దీంతో 25వేల సీట్ల సామర్థ్యమున్న దుబాయ్ స్టేడియంలో 18,500 సీట్లు అందుబాటులో ఉంచగా.. అవన్నీ పూర్తిగా అమ్ముడైపోయాయి. భారత్–పాక్‌జట్లు చివరిసారిగా 2016 టి20 ప్రపంచకప్‌లో, అంతర్జాతీయ వన్డే మ్యాచ్ 2019లో ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో తలపడ్డాయి.

### ఐపిఎల్‌లో నేడు

రాజస్తాన్ X ముంబయి

సమయం: రా. 7.30 వేదిక: షార్జా

### పాయింట్ల పట్టిక

| జట్లు | ఆ | గె | ఓ | పా | నె.ర. |
|---|---|---|---|---|---|
| ఢిల్లీ | 13 | 10 | 3 | 20 | +0.526 |
| చెన్నై | 13 | 9 | 4 | 18 | +0.739 |
| బెంగళూరు | 12 | 8 | 4 | 16 | -0.157 |
| కోల్‌కతా | 13 | 6 | 7 | 12 | +0.297 |
| పంజాబ్ | 13 | 5 | 8 | 10 | -0.241 |
| రాజస్తాన్ | 12 | 5 | 7 | 10 | -0.337 |
| ముంబయి | 12 | 5 | 7 | 10 | -0.453 |
| హైదరాబాద్ | 12 | 2 | 10 | 4 | -0.475 |

నోట్: ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు, నె.ర.:నెట్ రన్‌రేట్,


## ఇ-వేలం - కాంకస్ట్ స్టీల్ & పవర్ లిమిటెడ్ (ఇన్ లిక్విడేషన్)
## ఇన్‌సాల్వేన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 క్రింద ఆస్తుల విక్రయం

లిక్విడేటర్ ద్వారా ఏర్పాటుకాబడిన లిక్విడేషన్ ఎస్టేట్ ఏర్పాటు భాగంగా కాంకస్ట్ స్టీల్ & పవర్ లిమిటెడ్ (ఇన్ లిక్విడేషన్) ద్వారా సొంతమైన అస్సెట్స్ మరియు ఆస్తుల విక్రయం, హానరబుల్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, కోల్‌కత బెంచ్ వైడ్ ఆర్డర్ 26 సెప్టెంబర్ 2018 తేదిన నియమించబడింది.
ఆసక్తిగల అభ్యర్థులు వివరణాత్మక EOI ప్రొసెస్ డాక్యుమెంట్ మరియు అస్సెట్ విక్రయం ప్రొసెస్ మెమొరిండం కార్పొరేట్ డెబ్టార్ వెబ్‌సైట్ https://concastispat.com/nclt.html మరియు ఇ–వేలం వెబ్‌సైట్ https://ncltauction.auctiontiger.net మీద అప్‌లోడ్ చేయబడింది.
వేలం విక్రయం ఇ–వేలం ప్లాట్‌ఫారం (ప్రతి 15 నిమిషాలు అపరిమిత పొడగింపు) https://ncltauction.auctiontiger.net ద్వారా జరుగును.

| అస్సెట్ లాట్ | విక్రయం పద్ధతి | తనిఖీ తేది | వేలం తేది మరియు సమయం | బయానా మొత్తం & దాఖలుకు గడువు | ఫ్లోర్ ప్రైస్ |
|---|---|---|---|---|---|
| అస్సెట్ లాట్ నం.1– బంకుర యూనిట్ | స్వతంత్ర పద్ధతి | అక్టోబర్ 19, 2021 లోపు | అక్టోబర్ 22, 2021 ఉ.11:01 నుండి అక్టోబర్ 22, 2021న 18:00 గం.ల వరకు | ఐఎన్‌ఆర్ 08 కోట్లు లేదా అక్టోబర్ 18, 2021 లోపు | ఐఎన్‌ఆర్ 81 కోట్లు |
| అస్సెట్ లాట్ నం.3– శ్రీకాకుళం యూనిట్ | స్వతంత్ర పద్ధతి | అక్టోబర్ 19, 2021 లోపు | అక్టోబర్ 22, 2021 ఉ.11:01 నుండి అక్టోబర్ 22, 2021న 18:00 గం.ల వరకు | ఐఎన్‌ఆర్ 05 కోట్లు లేదా అక్టోబర్ 18, 2021 లోపు | ఐఎన్‌ఆర్ 45 కోట్లు |

ఇ–వేలానికి సంబంధించి ఏదైనా సమాచారం కొరకు, సంప్రదించుటకు: శ్రీ సప్తరిషి బైద్య/శ్రీ నవ్‌నిత్ కుమార్ +91 98360 70992/79035 75095. ఇమెయిల్: LQ.Concast@in.gt.com.
తదుపరి వేలాల కొరకు పబ్లిక్ నోటీసు (వర్తిస్తుంది) http://concastispat.com/nclt.html మరియు ఇ–వేలం వెబ్‌సైట్ https://ncltauction.auctiontiger.net మీద ప్రచురించబడుతుందని దయచేసి గమనించవలెను.

**క్షితిజ్ చవచ్చరియా**
**లిక్విడేటర్ ఆఫ్ కాంకస్ట్ స్టీల్ & పవర్ లిమిటెడ్ (ఇన్ లిక్విడేషన్)**
ఐబిబిఐ రిజిస్ట్రేషన్ నం–ఐబిబిఐ/ఐపిఎ–001/ఐపి–పి00358/2017–18/10616
నమోదిత చిరునామా: C/O బి. చవచ్చరియా & కో., 8ఎ & బి, సత్యం టవర్ 3, అలిపోర్ రోడ్, కోల్‌కత–700027, ఇమెయిల్: Kshitiz@bccoindia.com

ప్రదేశం: కోల్‌కత
తేది: అక్టోబర్ 05, 2021



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Mallajosyula Venkata Subrahmanya Sarma, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68